# అడవిలో ధర్మదేవత

బ్రిడ్జిపైన నడుస్తూ క్రిందికి చూచాను.

రైలెప్పుడో వచ్చి స్టేషనులో ఆగి ఉంది. చేతి కందిన కవళం నోటి కందక పోవచ్చునని గదా సామెత! తొందర తొందరగా మెట్లుదిగి, టిక్కెట్టు కొనుక్కొని ప్లాట్‌ఫారం వైపు పరుగుతీశాను. రైలు దొరికితే సరి పోయిందా? సీటుగూడా దొరకాలి. పెట్టె పెట్టె సర్వే చేసుకుంటూ జనంలోనుంచీ చొచ్చుకుపోతుండగా, నా చేతినెవరో ఒడిసి పట్టుకున్నారు.

'ఛీ, ఛీ! ఏమిటిది?' అనబోయి, అంతలో నోరు మూసేసుకున్నాను. నవ్వుతూ కనిపించినవాడు ముకుందరావు. "ఆగవోయ్, చలపతీ! ప్లాట్‌ఫారంపైన తెలిసిన ముఖాలేవైనా ఉండచ్చు. కాస్త అటూ ఇటూ చూస్తూ వెళ్ళగూడదా?" అని పలకరించాడు. ఆ పలకరింపుతో నాలో రగులుతున్న చిరాకు మటుమాయమై

పోయింది. ముకుందరావు పాత బంధువు. చిన్ననాటి స్నేహితుడు. పురుషులందు పుణ్యపురుషులు వేరైనట్టుగా ఉద్యోగాల్లో మంచి ఉద్యోగాలు వేరు! మావాడు ఫారెస్టు డిపార్టుమెంటులో రేంజి ఆఫీసరు. ఎటొచ్చీ నా ప్రయోజకత్వంపైన వాడి కంతగా నమ్మకం లేదు. ఎదురుపడినప్పుడల్లా నా బడిపంతులు గిరీని గురించి ఎద్దేవా చేస్తాడు. ఏమైనా వాడిలో వో సుగుణం ఉంది. మనుషులంటే వెగటు మాత్రం లేదు. ప్లాట్‌ఫారంపైన నన్ను నిలవేసి పలకరించడమే అందుకు నిదర్శనం. చూచీ చూడకుండా వెళ్ళిపోయి ఉంటే, వాడిదేం పోయింది?

"ఏమైంది లేవోయ్, చలపతీ! విశేషాలేమిటో చెప్పు. ఎలా ఉన్నాయి నీ వూళ్ళు?"

నాకు నవ్వువచ్చింది. భగవంతుడనే తండ్రి తన ఆస్తిపాస్తుల్లో నుంచీ నాకేమో వూళ్ళనీ, తనకేమో అడవుల్నీ పంచిపెట్టినట్టుగా మాట్లాడ్డం మా వాడి వాడుక.

"వూళ్ళ మాటెందుకులే, ముకుందం! అవి ఎలా ఉండగూడదో అలా ఉన్నాయి. ఎవడికి వాడు తనపని తప్పితే మిగిలినవన్నీ చేస్తున్నాడు. ఉన్నదానికీ కావలసినదానికీ మధ్య ఉన్న అంతరాలు పెరిగిపోతున్నాయి. మంచివాడికి గుర్తింపు లేదు. చాలామంది విషయంలో చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతన లేదు. బడిలో, గుడిలో, మడిలో ఎక్కడ చూచినా రాజకీయాలే! బ్రతుకంతా గొడవ గొడవగా ఉంది. అన్నట్టు విన్నాక ముఖ్యమైన విషయం అడగాలి, మునుపటి కెప్పుడో ధర్మదేవత వూరిలో ఉండేదట! ఇప్పుడావిడ వూరినుంచి పారిపోయి అడివిలో చేరిందని చెప్పుకుంటున్నారు. బాబ్బాబూ! నీకు పుణ్యముంటుంది అడివిలో ఆవిడ ఆచూకీ నీకేమైనా తెలిసిఉంటే చెప్పగూడదా, ముకుందం?"

"ధర్మదేవత.... అడవిలో ధర్మదేవత...." పొట్ట చెక్కలయ్యేటట్టుగా నవ్వసాగాడు ముకుందరావు. తారస్థాయిలోకి వెళ్ళిన ఆ నవ్వు క్రమక్రమంగా ఫేడ్ అవుట్ అయిపోయేసరికి, గార్డు వేస్తున్న ఈల గూడా వినిపించింది.

"ఓరి నాయనా! అడివిలోని ధర్మదేవతను చూడాలని ఉబలాటంగా ఉందా నీకు? చూద్దువుగానీలే! వివరంగా చెప్పడానికి టైమ్ లేదు. నేను నా పరివారంతో

బాటు ఈ బండిలోనే వస్తున్నాను. నువ్వు పనపాకం స్టేషన్నుంచీ అప్రమత్తుడిగా ఉండు. చూడదలచుకున్న ధర్మదేవత స్వరూపాన్ని అక్కడి నుంచీ ప్రత్యక్షంగా చూడచ్చు. చూస్తావుగదూ! మళ్ళీ కలుస్తా...."

జనంలో కలిసి ముకుందరావు కనుమరుగై పోయాక నేనొక పెట్టెలో దూరడానికి ప్రయత్నించాను. కానీ అదేమంత సులభసాధ్యం కాదని ఇట్టే గ్రహించాను. ఎదురెదురు ద్వారాల నడుమ, రాకపోకలకని ఉద్దేశించబడిన తావులో దాదాపు పదిహేనుమంది దాకా నిలబడిపోయి ఉన్నారు. అందినంతవరకు ఆక్రమించి, ఇక దురాక్రమణకు తావులేదని సూచిస్తూ వాళ్ళు జగజెట్టీల్లా నాకు అడ్డు తగిలారు. కానీ అవసరమనేది ఏర్పడినప్పుడు పిల్లిగూడా పులిగా మారిపోవచ్చునని వాళ్ళకు తెలిసినట్టులేదు. 'తావు లేదు.... వెళ్ళు, వెళ్ళు.... నీకేనయ్యా చెప్పడం.... నువ్వేం మనిషివి కావా....' మొదలైన కటువైన మాటలకు మారొడ్డి నేనెలాగో కంపార్టుమెంటులోకి జొరబడ్డాను. నిన్నటి దురాక్రమణదారుడే నేటి హక్కుదారుడు— అన్న న్యాయం రైలుబండ్లలో గూడా వర్తిస్తుంది కాబోలు! పెట్టెలో ప్రవేశించిన కొద్ది నిమిషాలకే నా కందులో నిల్చోడానికేసుమండి— పౌరసత్వం లభించింది.

రైలు కూత పెట్టి మెల్లగా సాగబారింది.

అసలీ రైలింత రద్దీగా ఉందంటే ఇదంతా కాలమహిమ అనుకోగూడదు. ఇందుకు కారణాలేమిటో వితర్కించుకోవాలి. విళ్ళుపురంనుంచి కాట్పాడీ మీదుగా తిరుపతికి వెళ్ళే మీటరుగేజి బండిలో ప్రయాణం చేసిన వాళ్ళకు కొత్తగా చెప్పవలసిన పనేమీ లేదు.

రైలు ప్రయాణమంటే వో ఆల్లాటప్పా వ్యవహారమేమీకాదనీ, ఒక్కొక్కప్పుడు అది జీవన్మరణ పోరాటంగా పరిణమించవచ్చుననీ వాళ్ళిదివరకే స్వానుభవంవల్ల గ్రహించి ఉంటారు. మడివేలు పరామర్శకు బహు సకృత్తుగా మాత్రమే నోచుకునే రంగుమాసిన బట్టలతోను, నిరంతర తాంబూలం చర్వణంతో ఎరుపెక్కి గారపట్టిన పళ్ళతోను, కంచుపాత్రలో గులకరాళ్ళువేసి గిలకరించినట్టుండే ప్రసంగాలతోను దైవదర్శనం కోసం బయల్దేరి వచ్చే తమిళనాడు గ్రామీణ ప్రాంతపు యాత్రికుల దైవభక్తి ఏపాటిదో మనకు తెలియదు. కానీ వాళ్ళకు తోడి మానవుల పట్ల సద్భావం చాలా తక్కువని మాత్రం ఘంటాపథంగా చెప్పుకోవచ్చు. బండిలో ఎక్కిన మరుక్షణం నుంచీ వాళ్ళు కంపార్టుమెంటును తమసొంత ఆస్తికింద దఖలు

పరుచుకుంటారు. ప్రతి స్టేషనులోనూ ఎక్కే ప్రయాణీకుల కడ్డుతగిలి. అవసరమైనప్పుడల్లా తమ భుజబలాన్ని ప్రదర్శిస్తారు. స్థానికులకు అర్థమై చావదులెమ్మని 'ఎన్నడా ఇంద ఆంద్రాకారనుంగో' అంటూ ప్రారంభించి అచ్చమైన అరవంలో తిట్లవర్షం కురిపిస్తారు. రైలుబండి చిత్తూరు దాటి, పూతలపట్టు దాటి పాకాల జంక్షనులోకి వచ్చి ఆగేటప్పటికి వాళ్ళు మరింతగా జాగరూకులై పోవలసిన అవసరం ఏర్పడుతూ ఉంటుంది. ధర్మావరం వైపు నుంచీ వచ్చిదిగిన యాత్రికులతోబాటు, చదువుకోడానికి వెళ్ళే కాలేజి విద్యార్థులు, కూరగాయల తట్టల్ని మార్కెట్టుకు తీసుకెళ్ళే రైతులు, ఇంకా బజారు పనులపైన కోర్టు పనులపైన. టౌనుకు వెళ్ళవలసి ఉన్న గ్రామీణులు— ఇలా అందరూ కలిసి రైలును చుట్టుముడతారు. సంఖ్యాబలాన్ని బట్టి గెలుపు ఎవరిదైనా కావచ్చు. కానీ ఫుట్ బోర్డుపైన నిలబడైనా సరే, కిటికీ కమ్మల్ని పట్టుకుని వ్రేలాడుతూనైనా సరే, లేదా శుభ్రంగా టాపుపైన బైఠాయించి అయినా సరే — దేముణ్ణి నమ్మకున్న వాళ్ళు వైకుంఠం వెళ్ళినట్టుగా అందరూ తిరుపతికి చేరడమేమో ఖాయం! కాంగోనదిలో పడవ ప్రయాణాలను గురించి, హిమాలయాల్లో సాహసయాత్రలను గురించి ఘనంగా చెప్పుకుంటారు. రైల్లో తిరుపతికి వెళ్ళడం మరీ అంత తక్కువ ప్రమాదకరమైనదేమీ కాదు.

పదిహేను నిమిషాలై ఉండచ్చు. రైలు వేగం తగ్గింది. స్టేషను దగ్గరలో ఉందన్న మాట. అవునవును. వచ్చేదే పనపాకం స్టేషను.

స్టేషనులో రైలాగేసరికి గస్తీ సిపాయిలు హెచ్చరిక గా 'హుషార్' చెప్పుకున్నట్టుగా ప్రయాణీకులు పరస్పరం హెచ్చరికలు చెప్పుకోవడం వినిపించింది. 'వచ్చేస్తా రొచ్చేస్తారు. భద్రం, భద్రం. జాగ్రత్త! కొంచెం తావిచ్చారో కొంప మునిగినట్టే! వేసేయండి— తలుపేసేయండి!''

రానున్న ఉపద్రవమేమిటో స్ఫురించక వెలుపలికి తొంగి చూశాను.

అలా చూచిన క్షణంలో నాకు విరాట్రూపం లాంటి దృశ్యం ఒకటి కనిపించింది. పెద్ద కాన్వాసు పైన చిత్రిస్తే, ఆ చిత్రానికి 'జీవన యాతన' అని పేరు పెట్టచ్చు. ఎత్తయిన గుట్ట. దానికి ఆవరణగా రైలుదారి వరకు వ్యాపించి ఉన్న చిట్టడివి. ఆ చిట్టడివిలోని చెట్లలోనుంచీ, తుప్పల్లోనుంచీ, ముళ్ళ డొంకల్లో నుంచీ పుట్టుకొచ్చినట్టుగా ఎన్నో మానవాకారాలు. బంకమట్టితో చేసిన బొమ్మల్లా, తుమ్మ

మొద్దుల్లోంచీ చెక్కిన ప్రతిమల్లా, పాషాణాన్ని కరిగించి పోతపోసిన విగ్రహాల్లా వివిధ వయోరూపాల వాళ్లు. కరువులు, తుపానులు, భూకంపాలు మొదలైన వాటి ద్వారా పడవలసిన బాధలన్నీ పడి, ప్రాణాలతో మాత్రమే బయటపడిన జీవచ్ఛవాల లాంటి వాళ్ళు. ఆడా మగా, పిన్నా పెద్దా వ్యత్యాసం లేకుండా విజయమో, వీర స్వర్గమోనన్న తెగింపుతో వాళ్ళు జీవన సంగ్రామంలోకి దూకినట్టున్నారు. పేళ్లుగా చీల్చి, తుండ్లుగా కత్తిరించి, దుంగలుగా తెగనరికి త్రాళ్ళతో కలిసి కట్టుకున్న వంట చెరుకు మోపుల్ని నెత్తిపైన మోసుకుంటూ వాళ్ళు రైలుబండీ వైపు పడిపడిగా నడిచి వస్తున్నారు.

మోస్తున్న వాళ్ళని విస్మరించి క్రమబద్ధంగా ముందుకు కదులుతున్న కట్టెల మోపుల్ని మాత్రమే లెక్కకు తీసుకుంటే, అవి జనమేజయుడి యజ్ఞకుండంలోకి దూకడానికి వెళ్ళే సర్పకులాన్ని తలపిస్తున్నాయి.

కాలు మోపడానికైనా వెలితిలేని పెట్టెల్లోకి వాళ్ళంతంత లావు మోపుల్ని ఎలా చేరవేయగలరో నాకు బోధపడడంలేదు. కానీ వాళ్ళు మాత్రం సడలని ఆత్మ విశ్వాసంతో నలుగురైదుగురు చేరి ఒక్కొక్క జట్టుగా పెట్టె పెట్టే చుట్టుముట్టే శారు. ఇవ్వని మొండికి, విడవని చండికి జరిగే పోరాటం సరిగ్గా అప్పుడే ప్రారంభ మైంది. వాళ్లు 'బాబ్బాబూ' అన్నారు. 'సచ్చి మీ కడుపున పుడతా' మని గింజు కున్నారు. 'నిన్నంతా పస్తు, సామీ! తిండిలేదు' అని ప్రాధేయ పడ్డారు. 'ఇవమ్ముకోని నాలుగురాళ్లు కళ్ళ జూస్తేనేనయ్యా మాకు బతుకు' అని దీనంగా అర్థించారు. చివరకు 'పెద్ద మనసు పెట్టండి, బాబూ! పున్నెం కట్టుకోండి దొరా! దయ పెట్టక పోతే మా బిడ్డ పాపల ఉసురు మీకు తగులుతుంది' అని పరోక్షంగా హెచ్చరించారు. ఇలా బ్రతిమాలుకుంటూ వాళ్లు కేవలం ప్రయాణికుల దయాదాక్షిణ్యాలపైనే ఆధార పడి ఉండిపోయారని చెప్పడం సబబుగాదు. మరొకవైపున వాళ్ళచేతులు వాటి పాటి కవి తమ కర్తవ్యాన్ని చేసుకుపోతూనే ఉన్నాయి. కొన్ని మోపుల్ని వాళ్లు మరుగుదొడ్డిలోకి తరలించేశారు. కొన్నింటిని సీట్ల క్రింద దూర్చేశారు. కొన్నింటిని నిటారుగా నిలబెట్టి భుజాల కానించుకున్నారు. పెట్టెకు వెలుపలివైపున కిటికీ చువ్వలకు ఇనుప కొక్కీలు తగిలించి కొన్ని మోపుల్ని వ్రేలాడ దీసేశారు.

పనపాకం వాటరింగు స్టేషను. తన దాహానికి సరిపడేటంత నీళ్ళు తాగిన తర్వాత త్రేన్పుతున్నట్టుగా పొగ వదిలిపెట్టి ఇంజను మళ్ళీ ముందుకు కదిలింది.

బండి స్టేషన్లో ఆగిన పది నిమిషాలలోను కట్టెల మోపులవల్ల క్షతగాత్రు లయిన ప్రయాణికులు ఇప్పుడు బాహాటంగా నోరు పారేసుకుంటున్నారు. ఒకరికి మోకాలు దగ్గర చీరుకుపోయింది. ఒకరికి కాలి వ్రేలు చితికింది. ఒకావిడ పైట చెరగు చిరిగి పోయింది. ఇంకొకాయన తటాలున చేయి ఇవతలికి తీసేశాడుగానీ, లేకుంటే మణికట్టు దగ్గర విరిగిపోవలసింది.

తమ సొంత ఆస్తికి, ఆదాయానికి సేగి లేకపోతే మిగిలిన ప్రపంచ మేమై పోయినా పట్టించుకోని వాళ్ళు కొందరుంటారు. నేనెక్కిన కంపార్టుమెంటులో బహుశా అలాంటి వాళ్ళ సంఖ్యే ఎక్కువేమో! అందుకు మినహాయింపుగా బిగ్గరగా ఒక గొంతు నాకు వినిపించింది.

"ఇంకేముందిలే నాయనా! అంతా అయిపోయింది. ఇంకొకతరం ఈ మాదిరిగానే గడిస్తే, అప్పుడింక మాసలాకైనా అడివనేది ఉండదు. ఇప్పుడు మీరు చూస్తా ఉండారే ఆ గుట్ట, దానికాపక్కన ఉండేదే గుండాలకోన. నాకు బుద్ధి తెలిసే టప్పటికి ఆ కోనలో తాటిచెట్టంత ఎత్తుండే నేరేడు చెట్లు ఉండేవి. మర్రి చెట్టంత మామిడిచెట్లు ఉండేవి. గుములు గుములుగా మద్దిచెట్లు ఉండేవి. పగటి పూటయినా ఆ కోనలోకి వెళ్ళాలంటే భయమే! అల్లాంటిదేమైంది? ఇప్పుడది గుండాలకోన కాదు. గుండాలబయలు. గడ్డిఉంది కాబట్టి గొడ్లుపోయి మేసిరావచ్చు. ఈ లెక్కన బండి బండికీ నూరు మోపులు పట్నంలో దిగతావుంటే అడువులు బరాబయలుగాక ఇంకేమవుతాయి? నేనేమో అచ్చరమ్ముక్క రానోన్నేననుకో, సామీ! అయితే ఒకమాట సెప్తావుండా. ఇంకొక నూరేండ్లు ఇదేపని జరిగితే కుక్కను కొట్టాలంటే కట్టె ఉండదు. పండ్లు తోముకోవాలంటే పుల్ల ఉండదు! ఏం నాయినా! నాకు తెలీకడుగుతా. చెట్టులేని దేశమేమవుతుంది?"

"ఏమవుతుంది? ఎడారవుతుంది."

"ఎడారా! అదెట్లా ఉంటుంది, సామీ?"

ఇందాకా బదులు చెప్పిన చదువుకున్న ఆసామీ ద్వారానే మరికొంత వివరణ లభించింది 'ఎడారంటే పెద్దాయనా, అక్కడ వానలు పడవు. పంటలు పండవు. వట్టి ఇసుకే ఉంటుంది...."

"అయితే ఆ మనుషులు అందరూ ఇసుకే భోంచేసి ఎట్లా బతకతారో?"

వంట చెరకు మోపుల వాళ్ళిపుడు దేశ శ్రేయస్సుకు ఘోర శత్రువులా. రాబోయే అనర్థానికంతా మూలకారకుల్లా కనిపిస్తున్నారు. కొందరికైతే వాళ్ళపట్ల పట్టరానంత కోపం వచ్చింది. ఒకాయన తన ఆగ్రహాన్ని మాటల్లోకి అనువదించేశాడు.

"ఏమమ్మీ! బండి తేరకు దొరికిందిగదా అని మీరిదేపనిగా ఇట్లా చేయడం ఏమైనా బాగుందా? మిమ్మల్ని, మీ కట్టెల్ని రవాణా చేయడానికేనా రైలు బండ్లుం దేది? అయినకాడికి అడవుల్ని నరికేస్తున్న నేరానికే మిమ్మల్ని జైల్లోపడదోయచ్చు. ఛీఛీ బుద్ధుండనక్కర్లా? బతకాలంటే మార్గాలే లేవా? ఏకూలో నాలో చేసుకుంటే పొట్టగడవదా?"

"కూలీలు దొరికేదెక్కడ నాయనా? ఉన్నపస్లు రైతులకే సాలడం లేదు. సాలందానికి కరువచ్చి పడిందని సెప్పి, పైగడ్డ నుంచీ జనం ఏకదాడిగా వచ్చి దిగ బడి పోతావుండారు. జల్మమెత్తినాక మనసులందరూ బతకాలి బతకాలంటే ఏదో ఒక పని సెయ్యాల. మా కిప్పుడీపని ఒకటే కడుపుకింత బువ్వ పెడతావుంది. మానుకోమంటావా దొరా! మంచిదే. నువు సెప్పినట్టే ఇనుకుంటాము. ఒకపూట తిండిపెట్టి, దినానికి మూడు రూపాయలి స్తేసాలు. కట్టగట్టుకొని మీవూరొచ్చేస్తాము. మాకేదైనా పని సూపిస్తావా, సామీ?"

ఎంతసేపు వేచిచూచినా ఈ ప్రశ్నకు సమాధానం లేదు.

"వృక్ష దోహద క్రియ మేటి ధర్మువుకుమార" అన్నది భారతనీతి. మహాభారతమనే గ్రంథంలో ఉన్న ఈ నీతినిబట్టి చూస్తే, వెయ్యేళ్ళకు మునుపటినుంచీ మన దేశంలో ఈ సూక్తికి పాటింపు ఉన్నట్టు తెలుస్తుంది. మరైతే ఇంతకాలం తర్వాత ఈనాటికి వృక్ష నాశన క్రియ ఒక తప్పనిసరి వ్యవహారమైపోయింది. అడవుల నిర్మూలనం వల్ల దేశానికి తీరని నష్టం కలిగేమాట వాస్తవం. దీన్ని ఎలాగైనా నివారించాలి. అంతపనీ జరగాలంటే చెట్లుకొట్టి, కట్టెలమ్ముకునే వాళ్ళకు వేరే జీవనోపాధి ఏదైనా చూపించాలి.

ప్రకృతి వనరులు పదిలంగా వుండాలి.

ప్రజలు సంతృప్తితో జీవించాలి.

దీనికుపాయం?

ఇది తన ఉద్యోగ జీవితంలో మా ముకుందరావు అనుదినమూ ఎదుర్కొంటున్న సమస్య దీన్ని గురించి అతడి అభిప్రాయమేమిటో అడిగి తెలుసుకోవాలి.

చంద్రగిరి స్టేషను వచ్చిందో లేదో తుఫానులాంటి సంక్షోభం ఒకటి బండిపైన విరుచుకు పడింది. క్రాసింగు ఉండడంవల్ల కొందరు ప్రయాణికులు ప్లాట్‌ఫారంపైన తచ్చాడడం కోసం క్రిందికి దిగేశారు. ఈలోగా యూనిఫారంలో వున్న వ్యక్తులు కొందరు ప్రతి పెట్టెలోకి దూరి, అగ్నిప్రమాదంలో నుంచీ వస్తువుల్నితీసి గిరవాటు పెట్టినట్టుగా కట్టెల మోపుల్ని ప్లాట్‌ఫారంపైకి గెంటేశారు. అంగలారుస్తూ, ఆక్రోశిస్తూ వెంటబడ్డ వాళ్ళచేతనే ఆ మోపుల్ని మోయించి, ప్లాట్‌ఫారం చివర ఒక కుప్పగా ప్రోది చేయించారు. వీరవిహారంలా కొనసాగిన ఈ సన్నివేశంలో మా ముకుందరావు అసహాయ శూరుడులాగా ఎక్కడా తానై విహరించడం నేను గమనించాను. కట్టెలమ్ముకునేవాళ్ళ దైన్యావస్థను మాత్రం చూపరులెవరూ పట్టించుకున్నట్టులేదు. వాళ్ళు జూదంలో రాజ్యాల్ని పోగొట్టుకున్న రాజుల్లా, కట్టుబట్టలను పావురాలెత్తుకుపోగా ఖిన్నులై పోయిన నలచక్రవర్తుల్లా విధి వక్రించడం వల్ల వికృతరూపులుగా మిగిలిన బాహుకుల్లా దూరంగా నిలబడి చేజారిపోయిన తమ జీవనాధారంవైపు గ్రుడ్లు మిటకరించి చూస్తున్నారు.

ప్రత్యక్ష సాక్షులుగా ఈ తతంగాన్ని పరికిస్తున్న తోడి ప్రయాణికుల ముఖాల్లో ఒక సంతృప్తి పారాడుతున్నట్టు నాకు తోచింది. ఎలాగైతేనేం, అడవులు అనాథలు కావు. వాటిని రక్షించడానికి ఒక బలగం వుంది. కొంచెం ఆలస్యంగానైతేనేం, వాళ్ళు తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నారు.

మధ్యలో ఒకటి రెండు హాల్టు స్టేషన్లు ఉండడంవల్ల కొంత కాలహరణం జరగవచ్చునేమో గానీ, చంద్రగిరినుంచీ తిరుపతికి రన్నింగు టైము ఇరవై నిమిషాలే. తిరుపతి స్టేషనులో నుంచి బయటపడి, బజారువైపు దారి తీస్తుండగా పిలుపు వినిపించింది. "ఇలా రావోయ్, చలపతీ! చాలా కాలమైంది మనం కలిసి. కాఫీ త్రాగి వెళ్దువుగానీ రా!" హోటలు మెట్లపైనుంచీ పిలుస్తున్నాడు ముకుందరావు.

ఆశ్చర్య మేమిటంటే, చేయరాని పనేదో చేసినట్టు, 'చింతనీళ్ళు' త్రాగినవాడిలా ముఖంపెట్టి ఉన్నాడు ముకుందం. వెదికి చూచినా విజయగర్వంలాంటి దేదీ కానరావడం లేదు.

"మాబాగా జరిగిందిలే, ముకుందం! స్వధర్మ నిర్వహణ విషయంలో కన్న కొడుకునైనా 'స్పేర్' చేయకపోవడమే న్యాయం. పోనీ, పేదవాళ్ళుగదా అని వదిలేస్తే వాళ్ళెంతకైనా తెగిస్తారు" అంటూ ఒక్కింత అభినందన చిలకరించ బోయాను.

"ఏం బాగోలేదా, చలపతీ! ఎందుకొచ్చిన పీడ చెప్పు! ఈ రోజు మోపు లన్నింటినీ అలా ప్లాట్‌ఫారంపైన ప్రోగుచేశాంగదా! రేపింక వాటిని వేలం వేసి, వచ్చే డబ్బులు ఖజానాలో కట్టాలి. అందువల్ల ప్రభుత్వానికేదో ఒరిగిపోతుందని మురిసిపోకు. పాటగాళ్ళు ముందుగానే కలిసి కూడబలుక్కుంటారు. వంద రూపా యల కట్టెలకు పాతిక రూపాయలైనా రాలవు. కాకుల్నికొట్టి గద్దలకు వేసినట్టుంది నా పని!"

"నువ్వు అటవీశాఖాధికారివిరా, ముకుందం! చెట్లునరికి కట్టెలమ్ముకునే వాళ్ళను కనికరిస్తావా?" అన్నాను.

"కనికరించననుకో! వాళ్ళాపని మానేస్తారా?"

నేనేమీ బదులు చెప్పలేదు.

"మానరు. మానలేరు. అది వాళ్ళ బ్రతుకు. పైవాళ్ళ పోరు పడలేక, అప్పుడప్పుడూ నేనిలా 'రెయిడ్' జరిపించవచ్చు. మిగిలినప్పుడు వాళ్ళపాటుకు వాళ్ళు నిరాఘాటంగా ఈ పని చేసుకు పోతుంటారు."

"అలాగని చూచీ చూడనట్టు వూరుకుంటావా?"

ముకుందరావు బిగ్గరగా నవ్వేశాడు. "చూచీ చూడనట్టుగా వూరుకోవడమంటే దాన్నంత సులభంగా కొట్టిపారెయ్యకు. అది చాలా గొప్ప కళ. నేర్పుగా సాధన చేస్తే, ఏ డిపార్టుమెంటులోనైనా సరే, కళాకౌశలానికి తగ్గ ప్రతిఫలం ముట్టి తీరు తుంది. ఎవరిదాకానో ఎందుకు! నా స్వవిషయమే తీసుకో. మోపుకొక రూపాయ అనుకున్నా రోజువారీ వసూలు అయిదు వందలకు తగ్గదు. అందులో నావాటా ఒక వందే ననుకుందాం. నెలకు మూడువేల రూపాయలు తక్కువ ఆదాయమా? ఏమంటావు, చలపతీ?"

ఏమనగలను— అడివిలో గూడా ధర్మదేవతకు దిక్కులేదని తేలిపోయాక!

—o—